
సాక్షి ఒడిశా
సోమవారం । 20 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,75,130లు, బంగారం 1.25 గ్రాములు, వెండి 43.7గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



బలహీన పడుతున్న ద్రోణి

- 8లో



జగన్నాథుని దర్శనం నిలిపివేత

- 8లో

న్యూస్‌రీల్

22కిలోల గంజాయి సీజ్



గంజాయితో పోలీసుల అదుపులో నిందితుడు

బరంపురం: కొందమాల్–గజపతి–గంజాం జిల్లాల సరిహద్దు నుంచి అక్రమ నగరానికి తరిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధి శ్రీక్షేత్ర విహార్ 5వ లైన్‌లోని ఓ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. ఇందులో అక్రమంగా నిల్వ ఉంచిన 22కిలోల గంజాయి తోపాటు కారు, బొలేరో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి, అరెస్ట్ చేశారు.

నడకపై చైతన్య ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా క్లబ్ సభ్యులు

రాయగడ: ఆరోగ్యానికి ఎంతగానో దోహద పడే నడకపై స్థానిక మహిళా క్లబ్‌లు ఆదివారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. మహిళా వాకర్స్ క్లబ్, జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్‌లకు చెందిన మహిళలు పట్టణంలోని గాంధీ పార్క్ నుంచి ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నడకను అలవాటు చేసుకోవాలని వివరించారు. క్లబ్ సభ్యులు శోభారాణి, రుబిరాణి కుండు, డాక్టర్ కె.సల్వరాజు, డాక్టర్ ఎన్‌కే కుండు తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ లోకి వెంకటాపురం గ్రామస్తులు



పార్టీలో చేరిన వారితో బీజేడీ నాయకులు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కిడిగాం పంచాయతీ వెంకటాపురం గ్రామస్తులు ఆదివారం బిజూ జనతాదళ్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో... గ్రామానికి చెందిన బారి నాగరాజు, పి.గోవిందరావు, చిన్నరావు, బారి లింగరాజు, బి.తిరుపతిరావు, కె.గున్నులు, కె.వెంకట్రావు, పి.సుధాకర్, సి.శ్రీరాములు తదితరులు బీజేడీ లోకి చేరారు. మిశ్రణ్ పర్వ్‌లో కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, రూపేష్ పాణిగ్రాహి, కాశీనగర్ అధ్యక్షుడు అఖిల పాత్రొ తదతరులు పాల్గొన్నారు.

భూగర్భంలో వేంకటేశ్వర స్వామి విగ్రహం



జగన్నాథ మందిరంలో భద్రపరిచిన వెంకటేశ్వర స్వామి విగ్రహం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి కేంద్రంలో భూమిలో ఓ వేంకటేశ్వర స్వామి విగ్రహం లభ్యమైంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జగన్నాథ మందిరం అర్చకులు రవిశాస్త్రికి ఈనెల 17న కలలో వేంకటేశ్వర స్వామి కనిపించి, ఆలయ పరిసరాల్లో తన విగ్రహం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు మరుసటి రోజు ఉదయం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులకు విషయం వివరించారు. ఆదివారం ఉదయం అంతా కలిసి చిత్రకొండ నుంచి 2కిలోమీటర్ల దూరంలోని నది నుంచి కలశాలతో నీటిని తీసుకు వచ్చి, మందిరం చుట్టుపక్కల తవ్వకాలు చేశారు. 8 అడుగుల లోతున భూగర్భంలో స్వామివారి విగ్రహం కనిపించింది. ఈ మేరకు విగ్రహానికి శుద్ధి చేసి, తాత్కాలికంగా జగన్నాథ మందిరంలో ప్రతిష్టించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

పాఖాలో.. పక్కా లోకల్!

- ఇంటింటా నోరూరిస్తున్న చద్దన్నం రుచులు
- ఆరోగ్యంతో పాటు ప్రీతికరమైన ఆహారంగా గుర్తింపు
- వేసవి ఆగమనంతో మరింత ప్రాధాన్యత
- నేడు పాఖాలొ దివాస్

భువనేశ్వర్: పెద్దల మాట చద్దన్నం మూట అనేది సామెత. ఆహారంలో చద్దన్నానికి ఇచ్చే ప్రాధన్యత అటువంటిది. వేసవి వస్తే పుల్లటి తరవాణి(పులిసిన గంజి), మజ్జిగతో చద్దెన్నం ఆరగిస్తే ఆ సత్తయే వేరని భావించే వారు. పాఖాలొగా పిలిచే ఈ భోజనం రాష్ట్ర ప్రజలకు అత్యంత ప్రీతికరమైన ఆహారం. వేసవి ఆగమనంతో ఇంటింటా పాఖాలొ రుచులు నోరూరిస్తుంటాయి. పక్కా లోకల్ తినుభండారమైనా.. రాష్ట్ర పరిచయ ప్రతీకగా రాజ్యమేలుతున్న మాట నిజం. ఏటా మార్చి 20న పాఖాలొ దివాస్(పాఖాలొ దినం)గా జరుపుకోవడం విశేషం. ఈ వేడుకకు ఇంత వరకు ఎటువంటి గుర్తింపు లేకున్నా, రాష్ట్రంలో యువతరం నడుం బిగించి పాఖాలొ దిబొసా ప్రాచుర్యానికి రెక్కలు తొడుగుతోంది. పేరొందిన హోటళ్లు ఇతరేతర స్వచ్ఛంద సంస్థలు పాఖాలొ దిబొసా వేడుకలకు వేదికగా నిలుస్తున్నాయి.

బహుళ రుచులతో..

శాకాహారం, మాంసాహారం వంటకాలతో పాఖాలొ విందు జరుపుకోవడం పట్ల యువత ఉత్సాహం కనబరుస్తోంది. పెరుగు, మామిడి, అల్లం తురుము, కరివేపాకు రెబ్బలతో శాకాహార పాఖాలొ ఘుమఘుమలాడుతుంది. శాకాహార పాఖాలొ ఆరగించేందుకు ములక్కాడల వేపుడు, ఒడియాలు, కాకర–ఆలుగడ్డల చిప్స్, గుమ్మడి పువ్వుల వేపుడు, బంగాళదుంపల పిడుపు, తండూరి టమాటా చట్నీ, వంకాయ వేపుడు, ఆవ పిండికూర(బెసారొ), ఆవకాయ, అప్పడాలు నంజుగా వినియోగిస్తారు.



పాఖాలొ ఆరగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ (ఫైల్)

నిమ్మరసం, మిరపకాయలు, వెల్లుల్లి రెబ్బలు రుచికి తగినట్లు జోడించి సుమారు గంటపాటు ఉంచి సుగంధ పాఖాలొ వడ్డిస్తారు. రొయ్యలను ఉడికించిన రెండో విడత నీటిలో మిరియాలు, ఉప్పు, వెనిగర్ మిశ్రమంతో తయారైన టబాస్కో సాస్, ఉప్పు, అల్లం, మిరియాలు కలిపి మాంసాహార పాఖాలొ సిద్ధం చేస్తారు.

చమత్కార సామెతల ఆవిష్కర్త..

సమష్టి కుటుంబాలు పోయి వ్యష్టి కుటుంబాలు వచ్చాక ఆనాటి చద్దెన్నం సంస్కృతి క్రమంగా తెరమరుగు అవుతుందనుకుంటే పొరబడినట్లే. రిఫ్రిజిరేటర్ సంస్కృతి వచ్చాక ఇదే ఎక్కువైంది. కానీ ఆగరింపులోనే పాత సంస్కృతి పోయింది. రిఫ్రిజిరేటర్ సంస్కృతిలో రాత్రన్నం మిగిలిపోతే పులిహోర కలపడం ఆనవాయితీగా చలామణి అవుతోంది. సమష్టి కుటుంబాల్లో జనాభా ఎక్కువ. ఒక్కోసారి రాత్రి మిగిలిపోయిన అన్నంలో పాలు పోసి, ఉల్లిపాయలు కలిపి తోడుపెట్టే వారు. ఉదయానికి కమ్మగా తోడుకుని అద్భుతంగా ఉండేది. ఇది అరుదుగా వచ్చే అవకాశం. జనాభా కారణంగా నిత్యం ఇటువంటి చద్దన్నం సాధ్యమయ్యేది కాదు. మంది ఎక్కువైతే మజ్జిగ పలచ బడుతుందనే సామెత అందుకే వచ్చిందేమో. ఇంటి పనుల్లో పడి వడ్డన ఆలస్యమైతే చద్ది కూడు ఆరగించిన కోడలుకి అత్త ఆకలి ఏం తెలుస్తుందనే సూదంటు చమత్కారం అప్పుడప్పుడు మార్మోగుతుండేది.

ఆరోగ్యదాయకం..

ముప్పొద్దులా తింటే పిల్లలు బలంగా ఉండి ఏపుగా ఎదుగుతారని పెద్దవాళ్లు నమ్మేవారు. ఇదే వైఖరిని శాస్త్రవేత్తల తాజా పరిశోధనలు బలపరుస్తున్నాయి. వైజ్ఞానిక ముద్ర పడడంతో నేటి తరంలో చద్దన్నం(పాఖాలొ) తారాస్థాయిలో రంగప్రవేశం చేస్తోంది. పాఖాలొ దిబొస్ పురస్కరించుకుని గల్లీ నుంచి తారాస్థాయి హోటల్ సంస్థలు రుచికరమైన కూరలను జోడించి పాఖాలొ వడ్డించి సొమ్ము చేసుకుంటున్నారు. శాకాహార పాఖాలొ థాలీ(ప్లేట్) ధర రూ.99 నుంచి రూ.299 కాగా.. మాంసాహారం రూ.249 నుంచి రూ.399 వరకు పలుకుతోంది. పాఖాలొ దిబొసా(చద్దన్నం దినం) ప్రాచుర్యంతో ఉదయం పూట టిఫిన్ బదులుగా అల్పాహార మెనూలో చద్దెన్నం చోటు చేసుకునే శుభ ఘడియలు దగ్గర పడుతున్నాయని నిర్వాహకుల వర్గం భావిస్తోంది. చద్దన్నం ప్రోబయాటిక్, ఐరన్ అండ్ కాల్షియం తదితర పోషకాలు ఎక్కువగా ఉంటాయి. బీ విటమిన్ దీనిలో పుష్కలంగా ఉంటుందని వైజ్ఞానిక వర్గాల సమాచారం.



ఆరగించడానికి సిద్ధంగా ఉన్న మాంసాహార పాఖాలొ

56 భోగాల్లో ఒకటి..

సాక్షాత్తు జగన్నాథ స్వామికి నివేదించే 56రకాల భోగాల్లో(నైవేద్యాలు) పాఖాలొ కూడా చోటు చేసుకోవడం విశేషం. వేసవిలో ఉదయం స్వామి దర్శనం చేసుకుని వెనుదిరిగే ద్వారం ప్రాంగణంలో మట్టి పిడతల్లో తరవాణి భక్తులకు విక్రయిస్తారు. తరవాణిలో నిమ్మ, దబ్బ ఆకులను జోడించి ఘుమఘుమలాడించడం విశేషం.

మహేంద్రగిరి అభివృద్ధిపై చర్చలు



సమావేశమైన మహేంద్రగిరి పరిరక్షణ కమిటీ

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని చారిత్రక మహేంద్రగిరి పర్వతాల పరిరక్షణ, అక్కడి మౌలిక సౌకర్యాలపై స్థానిక పెద్ద రాధాకాంత మఠంలో సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. సమావేశంలో భాస్కరతీర్థ లక్ష్మీబాబా, మహేంద్రగిరి పరిరక్షణ సమితి సభ్యులు, ఉత్కళ హితేషిణీ సమాజ్ కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రొ, శ్రీకాంత్ పట్నాయక్(ఒడిశా పర్యావరణ పర్యవేక్షణ కమిటీ అధ్యక్షుడు), సీసీడీ అడ్డాల జగన్నాథరాజు, ఖొయిపూర్ సర్పంచ్, సమితి సభ్యులు హాజరయ్యారు. మహేంద్రగిరి పర్వతం కుంతీ, యుధిష్టర, భీమ మందిరాలకు విద్యుత్ సరఫరా, పంథ్ నివాస్‌కు తాగునీరు కోసం స్తంభాలు వేయాలని కోరుతూ ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. మహేంద్రగిరి పరిరక్షణ, విద్యుత్ ఇతర సౌకర్యాలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని కమిటీ అధ్యక్షులు పూర్ణచంద్ర మహాపాత్రొ కోరారు. దీనికి సభ్యులంతా ఆమోదించారు.

మాజీ ఎమ్మెల్యే బీరేంద్రపాండే మృతి



బీరేంద్ర పాండే(ఫైల్)

భువనేశ్వర్: ఝార్సుగుడ మాజీ ఎమ్మెల్యే బీరేంద్ర పాండే(75) భువనేశ్వర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కిడ్నీ సంబంధిత దీర్ఘకాల వ్యాధితో ఆయన గత కొంతకాలంగా మంచం పట్టారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఝార్సుగుడ అసెంబ్లీ స్థానం నుంచి 3సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1980, 1985, 1995లో వరుసగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన మృతిపట్ల పలువురు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నేతలు సంతాపం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా.. గత 15నెలల స్వల్ప వ్యవధిలో ఝార్సుగుడ నియోజకవర్గంలో నలుగురు ప్రముఖ రాజకీయ నాయకులు మృతి చెందారు. కిషోర్ మహంతి, హేమానంద్ బిశ్వాల్, నవకిషోర్ దాస్, వీరేంద్ర పాండే మరణాలు రాజకీయ నాయకత్వంలో ఒక రకమైన శూన్యతను మిగిల్చాయి.

వివాదంలో వీకే పాండ్యన్!

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 5టీ(ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ ఇన్సియేటివ్స్) కార్యదర్శి వీకే పాండ్యన్ వివాదంలో చిక్కుకున్నారు. గత 2రోజులు ఆయన.. నవరంగపూర్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడం దుమారం రేగింది. నవరంగపూర్ మండలం మండోడోంగ్రి గ్రామం సందర్శన పురస్కరించుకుని స్వాగతించిన సందర్భంలో ఆయన పాదాలను గ్రామస్తులు కడగడం వివాదాస్పదమైంది. పెద్దలకు పాదాలు కడిగి, గౌరవ పూర్వకంగా ఆహ్వానించడం కొన్ని ప్రాంతాల్లో సనాతన ధర్మంగా భావించే ఆచారం మనుగడలో ఉంది. అయితే పాండ్యన్ ప్రభుత్వ అధికారిక పర్యటనలో ఉండగా ఇలా సేవలు పొందడం అహేతుకమని వాదన బలం పుంజుకుంటోంది. ఇది ప్రజాసేవ తత్వం ఉల్లంఘనగా విచక్షణ వర్గం అభిప్రాయపడుతోంది. ఈ పరిస్థితిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆల్ ఇండియా సర్వీస్ ఆఫీసర్ల ప్రవర్తనా నిబంధనలను జారీ చేసి, సంస్కరణలు చేపట్టాల్సి ఉందని భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ప్రసన్న మిశ్రా అభిప్రాయం వ్యక్తంచేశారు.



నవరంగపూర్ జిల్లా మందోదోంగ్రి గ్రామంలో వీకే పాండ్యన్ పాదాలు కడుగుతున్న గ్రామస్తులు

పవర్ లిఫ్టింగ్ విజేతకు ఘన స్వాగతం

జయపురం: నేపాల్ రాజధాని ఖాట్మాండ్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ ప్రపంచ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన జయపురం యువకుడికి ఘన స్వాగతం స్వాగతం లభించింది. నేపాల్ నుంచి ఆయన స్వస్థలం జయపురానికి రైలులో ఆదివారం చేరుకున్నారు. ఈ సందర్భం సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) ప్రతినిధులు రైల్వేస్టేషన్ వద్ద స్వాగతం పలికారు. అంతర్జాతీయ పోటీల్లో వేర్వేరు విభాగాల్లో 2పతకాలు సాధించడం పట్ల వారంతా ప్రసంశించారు. భవిష్యత్‌లో దేశానికి మరిన్ని పతకాలు సాధించి పెట్టాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో సీవా అధ్యక్షుడు అయ మిశ్రా, కార్యదర్శి ప్రతాప్‌కుమార్ పట్నాయక్, సభ్యులు మున్నా సాహు, నలినీ బర్దన్, శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద విశ్వనాథ్‌కు స్వాగతం పలుకుతున్న సీవా ప్రతినిధులు

ఉండమ్మా.. బొట్టు పెడతా..



బొట్టు పెట్టి ఉగాది కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్న దృశ్యం

రాయగడ: ఈ ఏడాది ఉగాది ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకోనున్నాయి. ఉత్కళ తెలుగు సమాఖ్య, జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ వేర్వేరుగా రెండు వేదికలపై ఉత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో సంబరాలను తిలకించేందుకు వినూత్న రీతిలో పట్టణ వాసులను ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ మహిళా విభాగానికి చెందిన మహిళలు వీధుల్లో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి, ఆడపడుచులకు బొట్టుపెట్టి ఆహ్వాన పత్రికను అందించడంతో పాటు సంబరాలకు రావాల్సిందిగా కోరుతున్నారు. నువ్వా నేనా అన్న రీతిలో పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక హోటల్ తేజస్విని ఓపెన్ గ్రౌండ్‌లో నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ఈటీవీ జబర్దస్త్ కళాకారులు రామ్‌ప్రసాద్, రోహిణి, ఇమాన్యుయల్, బాబు తోపాటు యాంకర్లు శ్యామల, అనసూయ భరద్వాజ్, ప్రముఖ గాయకులు ఎస్పీ చరణ్, కల్పన, ఇండియన్ ఐడిల్ జయంత్, అదితి భవరాజు, ఇమిటేషన్ రాజు పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సాహంగా ఉగాది పోటీలు

రాయగడ: ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రంగోలి, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో రితిక బెహెరా ప్రథమ, ఇప్పిలి శిరీష ద్వితీయ, దేవ్‌రాజ్ తృతీయ, ఊన్న శ్రీయాన్ ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు. చిత్రలేఖనం సీనియర్ విభాగంలో బాలమిక జొడియా, వర్షారాణి దాస్ వరుస స్థానాల్లో నిలిచారు. లాడి బ్రాహ్మణి, జి.గీతలు తృతీయ బహుమతులు, పి.జ్యోత్స్న లకు ప్రోత్సాహక బహుమతి లభించింది. మహిళల పోటీల్లో ఇప్పిలి అర్షిత, ఎస్.ఇందుమతి, కె.అలేఖ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి దక్కించుకున్నారు. జి.సుమాలిక ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు. మహిళల మధ్య జరిగిన రంగోలి పోటీల్లో పి.భాగ్యశ్రీ ప్రథమ, కె.తరణి ద్వితీయ, వి.హేమలత, ఇప్పిలి ఆశ తృతీయ, పట్నాన జయంతి బహుమతులు లభించాయి.



జూనియర్ విభాగంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పోటీల్లో బహుమతి పొందిన ముగ్గు




జయపురం: సిటీ స్కూలులో ముగ్గుల పోటీలు

అకాల వర్షాలతో అంతరాయం

జయపురం: అకాల వర్షాలు కారణంగా ఉగాది ఉత్సవాలకు అంతరాయం ఏర్పడింది. తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహిస్తున్న పోటీలకు మైదానం మొత్తం జలమయం కావవంతో నిర్వాహకులు ఆలస్యంగా పోటీలను ప్రారంభించారు. సోమవారం మెహందీ, వంటల పోటీలు జరగనున్నాయి. ఈనెల 21, 22 తేదీల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో చేపట్టానున్నారు.

క్లుప్తంగా

చిరుత, జింక చర్మాలు స్వాధీనం



ఎస్టీఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్న చిరుత, జింక చర్మాలు

భువనేశ్వర్: బౌద్ డివిజన్ అటవీ శాఖ అధికారులతో కలిసి స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్టీఎఫ్) బృందం చేపట్టిన దాడుల్లో వన్యప్రాణుల చర్మాలు పట్టుబడ్డాయి. బౌద్ జిల్లా హరభంగా పోలీసు ఠాణా పరిధి ఛత్రంగా ప్రాంతంలో గిరీష్‌కుమార్ సాహు అనే వ్యక్తి నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఆయన వద్ద చిరుతపులి చర్మం, రెండు జింక చర్మాలు, ఇతర నేర సంబంధిత పత్రాలు ఉన్నాయి. పక్కా సమాచారం మేరకు ఛత్రంగా, హరభంగా కూడలి ప్రాంతంలో చేపట్టిన ఆకస్మిక దాడిలో వీటిని జప్తు చేశారు. ఐపీసీ సెక్షన్లు 379/411/120(బి), వన్యప్రాణుల(రక్షణ) చట్టం, 1972 సెక్షన్ 51 కింద నిందితునికి వ్యతిరేకంగా కేసులు నమోదు చేశారు. బౌద్ ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం హాజరు పరచనున్నారు. జప్తు చేసిన జంతువుల చర్మాలను డెహ్రాడూన్ లోని డైరెక్టర్ డబ్ల్యూఐఐ ఆధ్వర్యంలో పరీక్షల కోసం సిఫార్సు చేశారు.

జగన్నాథుని దర్శనం నిలిపివేత



భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో స్వామిదర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు దేవస్థానం అధికార వర్గాలు ఆదివారం ప్రకటించారు. చైత్ర బహుళ చతుర్దశి పురస్కరించుకుని స్వామివారికి ఖోసాపాడా సేవ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సోమవారం ద్వితీయ భోగ మండప సేవ ముగియడంతో సాధారణ వర్గాలకు ఆలయ ప్రవేశం నివారిస్తారు. ఈ సేవ దాదాపు 5గంటల సేపు నిరవధికంగా కొనసాగుతుంది. సోమవారం సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఖోసాపాడా సేవ సమయం ఖరారైనట్లు దేవస్థానం వర్గాలు తెలిపాయి. ఈ వ్యవధిలో భక్తులకు శ్రీమందిరం రత్న వేదికపై స్వామి దర్శనం లభించదు.

జగనన్న మహిళా మార్ట్‌లపై కేరళ టీమ్ సంతృప్తి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్‌లు ఎంతో బాగున్నాయని కుటుంబశ్రీ, కేరళ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాఫర్‌మాలిక్ అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెప్మా విభాగంలో అమలవుతున్న కార్యక్రమాలను కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా మహిళామార్ట్‌లు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న మహిళల చేయూత కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పొదుపులు, అప్పుల చెల్లింపు ఎలా జరుగుతుంది అనే విషయాలపై తెలుసుకుని కేరళలో అమలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న చేయూత, జగనన్న తోడు, అమ్మ ఒడి, సున్నావడ్డీ కార్యక్రమాలు ఎంతో ఆదర్శవంతంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే అమలవుతున్న 'గుప్పెడు బియ్యం' కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్శనలో మెప్మా పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఇద్దరు ఎంపిక



పి.తరుణ్



బి.రేవతి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సౌత్‌జోన్ జూనియర్స్ (అండర్-18) హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో పి.తరుణ్ (ఇంటర్ సెకెండియర్-ఎస్ఆర్ఐ కాలేజ్ శ్రీకాకుళం), బి.రేవతి (ట్రిపిల్ ఐటీ సెకెండియర్ ఎచ్చెర్ల) ఉన్నారు. వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలు ఆదివారం ప్రారంభంకాగా.. ఈ నెల 26వ తేదీ వరకు తమిళనాడు వేదికగా జరగనున్నాయి. జాతీయ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడంపై శ్రీకాకుళం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యక్షురాలు వై.లావణ్య, వై.మనోజ్ కుమార్, పి.బాలమురళి కృష్ణ, జె.రమేష్, బి.ఈశ్వరప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు.

బలహీన పడుతున్న ద్రోణి



బరంపురం: గోపాల్‌పూర్ తీరంలో ఎగసి పడుతున్న సముద్ర కెరటాలు



పర్లాకిమిడి: రైల్వేస్టేషన్ వద్ద ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

- వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు
- నేలకూలిన చెట్లు, ఇళ్లు

బరంపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి మరింత బలహీన పడటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గత 2 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం రోజంతా కుండపోతగా వర్షం కురవడంతో గంజాం జిల్లాలో వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన మార్గాల్లో రాకపోకలు స్తంభించి, జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. రుశికుల్యా నదితో పాటు గడాహడా, బగ్గువా, బగ్గలట్టి, బొడ నదుల నీటిమట్టం పెరిగింది.

జయపురంలో 148.2 మిల్లీమీటర్లు

జయపురం: పట్టణంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 148.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలు, గాలల కారణంగా జయపురం పట్టణంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అంధకారం నెలకొంది. విద్యుత్ విభాగ సిబ్బంది వర్షంలో కూడా పనులు చేసినా పలు ప్రాంతాల్లో ఇంకా చీకట్లు వీడలేదు. ఎంజీ రోడ్డు, మెయిన్ రోడ్డుతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అకాల వర్షాలతో మామిడి, జీడి మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.



మల్కన్‌గిరి: సలీమ్‌లో దెబ్బతిన్న ఇంటి పైకప్పును చూపిస్తున్న బాధితుడు



మల్కన్‌గిరి: దెబ్బతిన్న ఇంటిపై టార్పాన్ కప్పుడుతున్న దృశ్యం

కల్యాణ సింగుపూర్‌లో అత్యధిక వర్షపాతం..

రాయగడ: గత 24గంటల్లో జిల్లాలో కురిసిన వర్షాలతో కల్యాణ సింగుపూర్‌లో అత్యధిక వర్షపాతం నమోదైందని అధికారులు ప్రకటించారు. మునిగుడలో 39.7, రాయగడ 19.6, కొలనార 12.5, కల్యాణ సింగుపూర్ 42.6, కాసీపూర్‌లో 37.2, గుణుపూర్‌లో 20, పద్మపూర్‌లో 15.3, గుడారిలో 15.4, రామనగుడ 38.6, బిసంకటక్ 31.6 చంద్రపూర్‌లో 14.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మల్కన్‌గిరి జిల్లాలో..

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి టేమురుపల్లి, మహుపోదర్, కర్తాన్‌పల్లి, సలీమ్, క్యాంగ్ ప్రాంతాల్లో కురిసిన వర్షం, గాలుల ధాటికి ఇంటి రేకులు ఎగిరిపోయాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. మత్తిలిలో దెబ్బతిన్న ఇళ్లను అదనపు తహసీల్దార్ బ్రజ బిహారీ పరిశీలించారు. బాధిత కుటుంబాలకు టార్పాన్లు, ఆహార సామగ్రి అందజేశారు.

ప్రయాణికుల కష్టాలు..

పర్లాకిమిడి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆదివారం ఉదయం గుణుపురం-పూరీ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ వచ్చే సమయంలో వర్షం కురవడంతో రైలు ఎక్కేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గోడ పడి చిన్నారి మృతి..



చిన్నారి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పొడియా సమితి మెటగూడ గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటి మట్టిగోడ కూలి, 5నెలల చిన్నారి మృతిచెందింది. గ్రామానికి చెందిన మడకామి తన భార్య, పిల్లలతో కలిసి నిద్రపోతున్న సమయంలో అకస్మాతుగా గోడ కూలడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. మిగతా వారికి గాయాలు కావడంతో బాధితులను పొడియా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



బరంపురం నగరంలో కురుస్తున్న వర్షం



జయపురం: మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం



మల్కన్‌గిరి: కూలిన ఇంటి గోడ

రామగిరిలో బీఎస్ఎఫ్ జనసంపర్క శిబిరం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న యువకులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి రామగిరి గ్రామంలో 151 బీఎస్ఎఫ్ బెటాలియన్ సిబ్బంది జనసంపర్క శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రవీన్‌కుమార్ మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. అలాగే బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సులో చేరి, దేశసేవకు అంకితం కావాలని సూచించారు. యువతకు స్వయం ఉపాధి కోసం సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 12మంది యువకులకు ప్రస్తుతం ఎలక్ట్రీషియన్లుగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

25 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



నాటిక పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న శంకరశర్మ తదితరులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్రపుష్కరిణి ప్రాంగణంలోని శ్రీ వైజయంతి ఉత్సవ వేదిక లో ఈనెల 25, 26, 27 తేదీల్లో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ప్రధానార్చకులు, శ్రీసుమిత్ర కళా సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం అరసవల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకరశర్మ నాటిక పోటీల వివరాలను వెల్లడించారు. ఈనెల 25వ తేదీ శనివారం సాయంత్రం 7 గంటల నుంచి కమనీయం, అక్కఅలుగుడు-చెల్లి సణుగుడు, 26వ తేదీ సాయంత్రం అతీతం, బరిబత్తల రాజు, మృత్యుపత్రం, ఈనెల 27న సాయంత్రం కొత్త పరిమళంచ ది లాస్ట్ జడ్జిమెంట్ పేరిట నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. అంతకుముందు ఈ కార్యక్రమానికి చెందిన ఆహ్వానపత్రికలను శ్రీసుమిత్ర కళాసమితి ప్రతినిధులంతా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండవల్లి రవి, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, ప్రధాన విజయరామ్, డి.పార్థసారధి, వివిఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుక.. కాపాడుకోవచ్చుగా!



ఒకప్పుడు ఊరంతా మాదే అన్నట్టు తిరిగిన ఊరపిచ్చుకలు ఇప్పుడు ఊరికైనా కనిపించడం లేదు. పట్టణీకరణ ప్రభావంతో ఆవాసాలు కరువైపోయి ఇవి కనుమరుగైపోతున్నాయి. వీటిని రక్షించాలనే ఉద్దేశంతో ఏటా మార్చి 20న అంతర్జాతీయ ఊరపిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన తరణి ప్రసాద్ మిశ్రా వంశధార నదీ తీరంలో ఇలా సైకత పిచ్చుకను తీర్చిదిద్దారు.

– ఎల్.ఎన్.పేట

గేట్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సత్తా

ఎచ్చెర్ల క్యాంపస్: గేట్ ఫలితాల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సత్తాచాటారు. శ్రీకాకుళం క్యాంపస్ నుంచి 46 మంది విద్యార్థులు అర్హత మార్కులు సాధించగా, జి.శివప్రసాద్‌రెడ్డి సీఎస్ ఈ విభాగంలో 21వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థిది విజయవాడకాగా, శ్రీకాకుళం క్యాంపస్‌లో చదువుతున్నాడు. ఈ విద్యార్థితో పాటు బి.జీవన సంధ్యారాణి ఈసీఈ విభాగంలో 78వ ర్యాంకు, కె.దీపక్ మెకానికల్ విభాగంలో 80వ ర్యాంకు, బి.రామకృష్ణ ఈసీఈలో 139వ ర్యాంకు, ఎస్.వినయ్‌కుమార్ ఈసీఈ 152వ ర్యాంకు, ఎస్.శ్రీసాయి ఈసీఈలో 337వ ర్యాంకు, కె.నాగేంద్ర ఈసీఈలో 635వ ర్యాంకు, పి.రవివెంకట్ ఈసీఈలో 694, పి.కుమార్ ఈసీఈలో 1257 ర్యాంకు సాధించారు. వీరిని అధ్యాపకులు అభినందించారు.

ఆలయంపై పిడుగుపాటు

- శ్రీకాకుళంలోని బలగ భద్రమ్మ తల్లి ఆలయంపై పిడుగు
- గోపురంపై విగ్రహాలు ధ్వంసం



భద్రమ్మ తల్లి అమ్మవారి విగ్రహం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని బలగ భద్రమ్మ తల్లి ఆలయంపై ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో పిడుగు పడింది. ఆ సమయంలో ఆలయం చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అర్చకులు పూజారి పాట్నూరు శ్రీను లోపల పూజ చేస్తుండగా పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో ఉలిక్కిపడ్డారు. ఈ పిడుగు ధాటికి ఆలయ గర్భగుడిలోనుంచి గోపుర సారంగం చివరి భాగాన పెచ్చులూడి కిందకు పడ్డాయి. అర్చకుడు బయటకు వచ్చి చూస్తే గోపురం బయట అంచున వెనుక భాగాన ఉన్న కాళీమాత, లక్ష్మీదేవి విగ్రహాలు పూర్తిగా ధ్వంసమై కనిపించాయి. గోపురంపైకి వెళ్లి చూస్తే మరో రెండు విగ్రహాలు ధ్వంసమైనట్లు తెలిసింది. అమ్మవారి మూలవిరాట్టుకు మాత్రం ఏమీ కాలేదు. విగ్రహంపైన ఉండే ఛత్రం పడిపోయింది. 165 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని ఏడాదిన్నర కిందటే గ్రామస్తులు చందాలు వేసుకుని జీర్ణోద్ధరణ చేశారు. రూ.3లక్షల మేర నష్టం ఉంటుందని భావిస్తున్నారు.



భద్రమ్మ ఆలయ గోపురం ముందుభాగంలో పాక్షికంగా దెబ్బతిన్న రెండు విగ్రహాలు

పిడుగు పాటుకు 78 మూగజీవాలు మృతి



పిడుగు పాటుతో మృతిచెందిన మేక, గొర్రె పిల్లలు

టెక్కలి రూరల్: మండలంలోని అయోధ్యపురం పంచాయతీ పరిధిలోని దీపావళి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి 78 మేక, గొర్రె పిల్లలు మృతిచెందాయి. పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలికి చెందిన డొక్కరి రాజు, ఆదినారాయణ, లక్ష్మణరావు, మల్లేషు, కృష్ణ, రామారావులకు చెందిన సుమారు 78 మేక, గొర్రె పిల్లలను తీసుకుని దీపావళి గ్రామంలో మంద వేశారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు వచ్చి పిడుగు పడడంతో మూగజీవాలన్నీ ఊపిరి వదిలేశాయి. విషయం తెలుసుకున్న యజమానులు సంఘటన స్థలానికి చేరుకుని విలపించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి నివేదికను ఉన్నతధికారులకు అందజేస్తామని పశుసంవర్ధక శాఖ ఏడీ జి.రఘునాథ్ తెలిపారు.

మెరుపులా..



పలాస మండలం తర్లాకోట పురాతన కోటవద్ద చిత్రమిది. ఆదివారం ఉదయం 6.15 నిమిషాలకు కురిసిన వర్షంలో ఇలా మెరుపులు మెరిశాయి.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

అందరూ అప్రమత్తంగా ఉండండి

- అధికార యంత్రాంగంతో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



అసెంబ్లీ ప్రాంగణం నుంచి కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: తుఫాన్ నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. జిల్లాలో తుఫాన్ నేపథ్యంలో ఆదివారం అసెంబ్లీ నుంచి జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్, అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో తుఫాన్‌ప్రభావం, కంట్రోల్‌రూంల ఏర్పాటు, వ్యవసాయం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ తదితర శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి పలు సూచనలు అందించారు. ముఖ్యంగా తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలు విస్తీర్ణాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలిపారు. పారిశుద్ధ్య పనులు,లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఏ అవసరమున్నా తనకు వెంటనే తెలపాలని అధికారులకు సూచించారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడి అరెస్టు

బొబ్బిలి: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సమస్యలపై ఛలో విజయవాడ పిలుపునివ్వడంతో అంగన్వాడీ,సీఐటీయూ నాయకులను ముందస్తు భద్రతా చర్యల రీత్యా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకర రావు, పట్టణ కార్యదర్శి సురేష్‌లను అరెస్టు చేశారు.

నేలకొరిగిన అరటి, మొక్కజొన్న



కోన గ్రామం సమీపంలో నేలకొరిగిన మొక్కజొన్న

మక్కువ: అకాల వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాలలో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. రెండురోజులుగా ఈదురుగాలులుతో కురుస్తున్న వర్షానికి కోన, శంబర, నంద తదితర గ్రామాలలో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగినట్లు రైతులు తెలిపారు. అలాగే పక్వానికి వచ్చిన మొక్కజొన్న కంకులు విరిచి, కళ్లాల్లో, రహదారులపై ఎండబెట్టినవి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం వర్షం తెరిపివ్వడంతో మొక్కజొన్న కంకులు ఎండబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

కుక్కల దాడిలో 25 గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

పార్వతీపురంటౌన్: గొర్రెల మందపై ఆదివారం ఉదయం కుక్కలు దాడిచేయడంతో 25 గొర్రెలు మృతిచెందగా మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన పార్వతీపురం మండలంలోని హిందూపురం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హిందూపురం గ్రామానికి చెందిన తామాడ రాము, కామేశ్వరరావు, బొట్ట సోమినాయుడు, వై.రాములు జీవనోపాధి కోసం గొర్రెలు కాస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. రోజూమాదిరిగా గొర్రెలను పాకలోకి పంపి భోజనం కోసం ఇంటికి వెళ్లారు. వారు వచ్చేలోపు గొర్రెల పాకలో ఉన్న మందపై సుమారు 8 కుక్కలు దాడిచేశాయి. దీంతో 25 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో 10 తీవ్ర గాయపడ్డాయని బాధిత రైతులు వాపోయారు. గొర్రెలతో రోజువారీ జీవనం కొనసాగిస్తున్న వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

30న ఉచిత వైద్య శిబిరం

విజయనగరం ఫోర్ట్: స్థానిక సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెల 30వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. శిబిరానికి హాజరయ్యే రోగులకు చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు సంబంధించి, పరీక్షలు చేయడంతో పాటు లావరోస్కొపిక్ సేవలు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి స్కానింగ్, ఎక్సరే కూడా ఉచితంగా తీస్తామన్నారు. ఆపరేషన్ చేసుకున్న వారికి ఉచితంగా మందులు కూడా అందజేస్తామన్నారు.

ఆర్బీకేల్లో పశు విజ్ఞాన బడులు



పాడి రైతులకు విజ్ఞానాన్ని అందించడం ద్వారా మూగజీవాల పరిరక్షణకు కావాల్సిన చర్యలు చేపట్టేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విజ్ఞానం అందించేందుకు ఆర్బీకేల్లో పశు విజ్ఞాన బడులను నిర్వహిస్తోంది. వీటి ద్వారా శిక్షణ ఇస్తూ వాటి సంరక్షణకు కావాల్సిన చర్యలు తీసుకుంది.

- పాడి రైతులకు విజ్ఞానం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు
- వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచడమే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా 500 ఆర్బీకేల్లో విజ్ఞాన బడులు ప్రారంభం
- పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు తరగతుల నిర్వహణ

నెల్లిమర్ల:

పశు సంవర్ధక శాఖ ద్వారా పశువులు, జీవాల అభివృద్ధికి రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు 1962 అంబులెన్సులను ప్రారంభించింది. మేలు జాతి ఆడ దూడల ఉత్పత్తికి రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పునరుత్పత్తి పథకాన్ని అమలు చేస్తోంది. వాటికి వచ్చే ఆరోగ్య రుగ్మతలను గుర్తించడానికి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధునాతన ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అక్కడితో ఆగకుండా నిర్వహణ వ్యయాన్ని తగ్గించి, ఉత్పత్తిని పెంచడానికి రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడులను తాజాగా ప్రారంభించింది. పశు సంవర్ధక శాఖ వైద్యులు ఆ బడుల ద్వారా పాడి రైతులకు మెరుగైన యాజమాన్య పద్ధతులను వివరిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో తరగతుల నిర్వహణ

జిల్లా వ్యాప్తంగా 500 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 3.78 లక్షల ఆవులు, 97 వేల గేదెలు, 4.5 లక్షల గొర్రెలు, 1.6 లక్షల మేకలను రైతులు పెంచుతున్నారు. వాటి పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించి, తద్వారా వ్యయాన్ని తగ్గించడానికి, పాల ఉత్పత్తిని పెంచడానికి అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం తాజాగా పశు విజ్ఞాన బడులను ప్రారంభించింది. బడుల ద్వారా రైతులకు అవసరమైన శిక్షణను అందిస్తున్నారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు వారంలో ఒక రోజు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి, మెరుగైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తున్నారు.



పశు విజ్ఞాన బడిలో శిక్షణ అందిస్తున్న అధికారులు

శిక్షణలో ఇలా..

రైతు భరోసా కేంద్రాల్లోని పశు సంవర్ధక సహాయకుల ద్వారా ప్రతి విజ్ఞాన బడికి 20 నుంచి 25మంది స్థానిక రైతులను గుర్తించారు. ప్రతి బృందంలోనూ ఆసక్తి కలిగిన ఓ మహిళా రైతు ఉండేటట్లుగా చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో పాడి పశువుల నిర్వహణ, మెరుగైన యాజమాన్య పద్ధతుల్లో మంచి అనుభవం ఉన్న ఒకరిద్దరు రైతులను గుర్తించారు. ఆ రైతులు తాము అవలంభించిన పద్ధతులను బృందంలోని రైతులకు వివరిస్తున్నారు. ప్రతిభ కలిగిన రైతులు సాధించిన విజయాలను వీడియోల ద్వారా అధికారులు ప్రదర్శిస్తున్నారు. ఆర్బీకేల్లోని టీవీల ద్వారా సంబంధిత ఛానెళ్లను వీక్షించి, విజ్ఞానం పెంపొందించుకునేలా చర్యలు చేపడుతున్నారు. రైతులను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి పచ్చగడ్డి పెంపకం, పాల దిగుబడిని పెంచడం, పశువులను పరిశుభ్రంగా పెంచడం తదితరాలపై శిక్షణ ఇస్తున్నారు. పశువులు, జీవాలకు అరుదుగా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధులకు గురవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సోకిన తరువాత అందించాల్సిన చికిత్సల గురించి శిక్షణ అందిస్తారు. సదరు విజ్ఞాన బడుల్లో పశువులు, జీవాల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎంతో ప్రయోజనం..



మా రైతు భరోసా కేంద్రంలో ప్రతి వారం నిర్వహించే పశు విజ్ఞాన బడి తరగతులకు నేను హాజరవుతున్నాను. ఆవులు, గేదెల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులను వివరిస్తున్నారు. మమ్మల్ని క్షేత్ర స్థాయికి తీసుకెళ్తున్నారు. అధికారులు అందిస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగపడుతోంది.

– ఎల్.కేశవరావు, రామతీర్థం

విజ్ఞానాన్ని అందిస్తున్నారు..



మా ఆర్బీకేలో ప్రతి వారం నిర్వహిస్తున్న పశు విజ్ఞాన బడి తరగతులు నాకు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. వీడియోల ద్వారా, టీవీ చానెల్ ద్వారా వివరిస్తున్న యాజమాన్య పద్ధతులు బాగా ఉపయోగపడుతున్నాయి. నిర్వహణ వ్యయం తగ్గించుకుని, పాల ఉత్పత్తిని పెంచడానికి తరగతులు దోహదం చేస్తున్నాయి.

– దుర్గాశి యర్రంనాయుడు, ఒమ్మి, నెల్లిమర్ల

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పశు విజ్ఞాన బడులను ప్రారంభించాం. స్థానిక ఆర్బీకే పశు సంవర్ధక శాఖ సహాయకుడి ద్వారా ఒక్కో బడికి 20 నుంచి 25 మంది రైతులను గుర్తించాం. ఆయా గ్రామాల్లో పశువుల పెంపకం, మెరుగైన యాజమాన్య పద్ధతులను అనుసరిస్తున్న ఒకరిద్దరు రైతులను ఎంపిక చేశాం. వారి ద్వారా బృందంలోని రైతులకు శిక్షణ అందిస్తున్నాం. వెటర్నరీ అసిస్టెంట సర్జన్లు, అసిస్టెంట్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో వారంలో ఒక రోజు తరగతులు నిర్వహిస్తున్నాం. శిక్షణకు రైతులను క్షేత్ర స్థాయికి కూడా తీసుకెళ్తున్నాం. నిర్వహణ వ్యయం తగ్గించి, ఉత్పత్తిని పెంచడం బడుల ఏర్పాటు లక్ష్యం. రైతులు తరగతులకు హాజరై, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వైవీ రమణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

అప్రెంటిస్ సర్టిఫికెట్లతో చక్కని ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు అప్రెంటిస్ సర్టిఫికెట్లు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ మురళి

- ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సీనియర్ మేనేజర్

పార్వతీపురంటౌన్: అప్రెంటిస్ సర్టిఫికెట్ల ద్వారా అభ్యర్థులకు చక్కని ఉద్యోగావకాశాలు ఉంటాయని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ పార్వతీపురం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ బి.మురళి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురం పట్టణంలోని వాసవి, గాయత్రి డిగ్రీ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు గాయత్రి కళాశాలలో ఇండియా పోస్ట్ బ్యాంకు ద్వారా అప్రెంటిస్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంట్రల్ గవర్నమెంట్‌కు చెందిన ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా అప్రెంటిస్ పొందిన విద్యార్థులకు చక్కని అవకాశం ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాంక్ తదితర కాంపిటేటివ్ ఉద్యోగా ఎంపికలో ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. కళాశాల యాజమాన్యం చొరవతో తమ ఇండియన్ పోస్టల్ బ్యాంకు ద్వారా విద్యార్థులకు 90 రోజులపాటు విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. అప్రెంటిస్ కాలాన్ని చక్కగా క్రమశిక్షణతో పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో కాంపిటేటివ్‌పై దృష్టి సారించి ఉద్యోగాలు సంపాదించాలని కార్యక్రమంలో పాల్గొన్న ఇండియా పోస్ట్‌పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ సాగర్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శర్మ, ఏఓలు గౌరీశంకర్, శ్రీనివాసరావు, వి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

33 శాతం పంట నష్టం జరిగితే నమోదు



అన్నంరాజుపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జేడీ రామారావు

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు

జామి: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం 33 శాతం కన్నా ఎక్కువగా ఉంటే ఆయా పంటలను నమోదు చేయనున్నట్టు జిల్లా వ్యవసా య శాఖ జేడీ టీవీ రామారావు వెల్లడించారు. మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో మొక్కజొన్న పంటలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 45 గ్రామాల్లో 869 ఎకరాల్లో మొక్కజొన్న పంట వర్షాలకు నెలకొరిగిందన్నారు. ఇలా పడిపోవడం వల్ల మొక్కజొన్న కంకులు పాలుపోసుకోకపోవడం, లేక పూర్తిగా తయారీ కాకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఈ విధంగా పంట నష్టపోయిన రైతుల వివరాలను వారం రోజుల్లోపు సర్వే చేయించి నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. రైతులు ముఖ్యంగా పొలాల్లో ఉన్న నిల్వ నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట మండ ల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్, స్థానిక సర్పంచ్ చెల్లూరి సూరిబాబు తదితరులు ఉన్నారు.

భారత్ గౌరవ్ రైలుకు ఘన స్వాగతం



భారత్ గౌరవ్ రైలెక్కేందుకు సిద్ధమైన ప్రయాణికులతో ఐఆర్‌సీటీసీ రీజనల్ మేనేజర్ చంద్రమోహన్ తదితరులు

విజయనగరం టౌన్: సనాతన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షిస్తూ.. చారిత్రాత్మక ప్రదేశాలకు పర్యాటకులను అతి తక్కువ ధరలకే తీసుకువెళ్లేందుకుగానూ రైల్వే మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన 'భారత్ గౌరవ్' రైలు శనివారం అర్ధ రాత్రి దాటిన తర్వాత 2 గంటల ప్రాంతంలో విజయనగరం చేరుకుంది. ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్ చంద్రమోహన్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జిల్లా నుంచి బయలుదేరిన 25 మంది ప్రయాణికులకు స్వాగతం పలికారు. ఏడు రాత్రులు, ఎనిమిది రోజులు ప్యాకేజీతో పూరీ, కోణార్క్, గయా, వారణాసి, అయోధ్య, ప్రయోగ తీసుకువెళ్లి, తిరిగి గమ్య స్థానాలకు చేర్చుతుంది. రాత్రి 2.40 గంటలకు రైలు విజయనగరం నుంచి బయలుదేరింది.

రైలు బస్సు నడిచేనా...



బొబ్బిలి-సాలూరు మధ్య నడిచే రైలు బస్సు(ఫైల్)

బొబ్బిలి రూరల్: బస్సులు లేని నారాయణప్పవలస, కాశిందొరవలస గ్రామ ప్రజలకు బొబ్బిలి నుండి సాలూరుకు గతంలో నడిచే రైలుబస్సు ఎంతో ఉపయోగపడేది. ప్రతీ రోజూ వందలాది మంది విద్యార్థులు ఈ బస్సులలో వచ్చి,పోయేవారు. మూడేళ్ల క్రితం కరోనా కారణంగా ఈ రైలుబస్సు నిలిపివేశారు. నారాయణప్పవలస, కాశిందొరవలస రైలు మార్గాలలో మూడేళ్లుగా రెండు పెద్ద రైళ్లను నిలిపివేశారు. రైలుమార్గం పాడైందని, ఇప్పట్లో రైలు బస్సు నడపడం సాధ్యం కాదని రైల్వే డీఆర్ఎం అనూప్‌కుమార్ శత్పధి ఇటీవల బొబ్బిలిలో తెలిపారు. దీంతో రైలుబస్సు పునఃప్రారంభంపై ఈ ప్రాంత ప్రయాణికులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. రైలు బస్సులు తిరిగి నడపాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యా వ్యతిరేక విధానాలను ఆపాలి: యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రకార్యదర్శి ఎస్ మురళీమోహన్

విజయనగరం పూల్‌బాగ్: ఇప్పటికైనా విద్యా వ్యతిరేక విధానాలను ఆపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ డిమాండ్ చేశారు. స్థానిక కేఎల్ పురంలో ఉన్న ఎన్‌పీఆర్ భవనంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఈపీ పేరుతో 3,4,5 తరగతులను హైస్కూల్‌లో మెర్జింగ్ చేయడం ఆపాలని, ఇప్పటికే ఈ మెర్జింగ్ వల్ల రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 12 వేలకు పైగా ఉన్నాయని తెలియజేశారు. ఇలా పాఠశాలలన్నీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారడం వల్ల నాణ్యమైన విద్య విద్యార్థులకు అందదని కాబట్టి మెర్జింగ్‌ను వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్‌కు కొత్త బాడీని ఎన్నుకోగా యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జేఆర్సీ పట్నాయక్, జేఏవీ ఆర్కే ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా ఎ.సత్య శ్రీనివాస్, సహాధ్యక్షులుగా వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి కోశాధికారిగా సీహెచ్.భాస్కరరావు, కార్యదర్శులుగా ప్రసాద్, వాసు, త్రినాథ్, పి.వాసు, రామినాయుడు, సూర్యారావు, తిరుపతినాయుడు, జీవీ రమణ రాజారావు, కేశవ, రాధా భవాని, శ్రీదేవి, ఎస్. సత్యనారాయణలు ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్స్‌గా కె.విజయగౌరి, డి.రాము, కె.శ్రీనివాసరావు, ఎం.అప్పలనాయుడు, కె.అప్పారావు, జి పద్మావతిలు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎ.శంకరరావు ఎన్నికయ్యారు. ఈ కౌన్సిల్‌లో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'ఆనందో బ్రహ్మ'



ఉగాది సంబరాల కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆనందో బ్రహ్మ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సందడిగా జరిగింది. తరచూ జరిగే సకల కళా కార్యక్రమాలతో పాటు ఉగాది సందర్భంగా ప్రత్యేక వేషధారణల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆకర్షించారు. ఉగాది సంప్రదాయాన్ని తెలియజేసేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రముఖులు నంబియార్ వేణుగోపాలరావును ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయమోహనరావు పాల్గొన్నారు.

పులి పాదముద్రల గుర్తింపు

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.చింతలవలస గ్రామ పరిసరాల్లో సపోటా తోటలో పులి సంచారానికి సంబంధించిన పాదముద్రలు గ్రామస్తులు గుర్తించారు. సమాచారాన్ని అటవీ శాఖాధికారులకు అందించారు. స్పందించిన అటవీ శాఖ అధికారులు శ్రీనివాసరావు, రవికుమార్ పులి సంచరించిన ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. ఆ ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మిర్తివలసలో కూడా పులి పాద ముద్ర లు గుర్తించారు.

జక్కువలో పులి జాడలు

మెంటాడ: జక్కువ గ్రామంలోని జన్నిగుడ్డి పొలాల్లో ఆదివారం పులి కాలిజాడలను రైతులు గుర్తించారు. సంబంధిత సచివాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. మెంటాడ బీట్ అధికారి కె.వి.ఎస్.రాజు ఆ ప్రాంతానికి చేరుకుని కాలిముద్రలను పరిశీలించి పులివేనని నిర్ధారించారు.



పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

రోగులకు రవాణా ఉచితం

రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యమే మహాభాగ్యంగా భావిస్తూ తొలి ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా పలు రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. దయాలిసిస్ రోగులకు సంబంధిత కేంద్రాల్లో చికిత్స కోసం తరలించేందుకు ఉచిత రవాణా సదుపాయం కల్పించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారి మన్ననలు పొందుతోంది.

- 108 అంబులెన్సుల ద్వారా డయాలసిస్ రోగుల తరలింపు
- నెలకు 500 మంది వరకు తరలింపు
- వారంలో ఎన్ని రోజులైనా ఉపయోగించుకునే అవకాశం
- జిల్లాలో ఉన్న 108 అంబులెన్సులు 28

విజయనగరం ఫోర్ట్:

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా వంటి పథకాల ద్వారా ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని సైతం ఉచితంగా అందిస్తోంది. అంతేకాకుండా చికిత్స అనంతరం ఆరోగ్య భృతిని అందిస్తోంది. 104 వాహనాల ద్వారా రోగుల వద్దకు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. ఆపదలో ఉన్న వారిని 108 అంబులెన్సు ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్నారు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేయించుకోవడానికి వారిని డయాలసిస్ సెంటర్‌కు ఉచితంగా 108 అంబులెన్సు ద్వారా తరలిస్తున్నారు.

గతంలో సొంత ఖర్చులతో...

2019 సంవత్సరానికి ముందు వరకు కిడ్నీ రోగులు డయాలసిస్ సెంటర్‌కు రావాలంటే సొంత ఖర్చులతో బస్సులోగాని, ఏదైనా వాహనాన్ని బుక్ చేసుకుని జిల్లా కేంద్రంలో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు వచ్చేవారు. ప్రైవేటు వాహనాల్లో రావడం వల్ల వారు ఇబ్బంది పడేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకోవడానికి 108 అంబులెన్సు ద్వారా ఉచితంగా సంబంధిత కేంద్రానికి తరలిస్తున్నారు.



108 అంబులెన్సు ద్వారా కిడ్నీ రోగి తరలింపు

ఉచితంగా రవాణ



డయాలసిస్ అవసరమైన రోగులను 108 అంబులెన్సు ద్వారా డయాలసిస్ సెంటర్‌కు తరలిస్తున్నాం. నెలకు 500 మంది వరకు రోగులను ఇలా కేంద్రానికి చేర్చుతున్నాం. వారంలో ఎన్ని రోజులైనా వినియోగించుకోవచ్చు.

– మన్మథనాయుడు, 108 జిల్లా మేనేజర్

నెలకు 500 మంది వరకు తరలింపు



డయాలసిస్ అవసరమైన రోగులను జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు 108 అంబులెన్సు ద్వారా తరలిస్తారు. వారంలో ఎన్ని రోజులైనా డయాలసిస్ రోగి 108 అంబులెన్సును వినియోగించుకోవచ్చు. నెలకు 400 నుంచి 500 మంది వరకు రోగులను తరలిస్తున్నారు. జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయి. వీటిని కిడ్నీ రోగులు వినియోగించుకుంటున్నారు. రవాణా ఖర్చులు లేకపోవడంతో కొంత వరకు ఉపశమనం పొందుతున్నారు. గతంలో డయాలిసిస్ కేంద్రానికి రావాడానికి రూ. వందల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దూర ప్రాంతాల వారైతే అంత కంటే ఎక్కువగానే ఖర్చు చేసేవారు. ప్రస్తుతం ఆ బాధ తప్పడంతో ఆర్థికంగా వెసులుబాటు లభించిందని సంతృప్తి పొందుతున్నారు.